క్లుప్తంగా

కార్యకర్తల కుటుంబాలకు అండగా పార్టీ



రాఘవ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాగార్జున

నాగులుప్పలపాడు: కార్యకర్తల కుటుంబాలకు పార్టీ అండగా ఉంటుందని మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ సంతనూతలపాడు నియోజకవర్గ డాక్టర్ మేరుగు నాగార్జున తెలిపారు. గురువారం మండలంలోని కేశినేనివారిపాలెం గ్రామంలో మరణించిన పార్టీ మండల కార్యవర్గ సభ్యులు యద్దల రాఘవ చిత్రపటానికి పార్టీ నాయకులతో కలిసి నాగార్జున నివాళులర్పించారు. రాపర్ల గ్రామంలో మరణించిన పార్టీ కార్యకర్త ఊదరగుడి దేవింగరావు మృతదేహానికి నివాళులర్పించి కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. కార్యక్రమంలో పార్టీ ఎస్సీ సెల్ రాష్ట్ర కన్వీనర్ కొమ్మూరి కనకారావు, మండల అధ్యక్షుడు పోలవరపు శ్రీమన్నారాయణ, తోకల శ్రీను, ఢాకా రమణారెడ్డి, కోడె సుబ్బారావు, తదితరులు ఉన్నారు.

రేపు యూటీఎఫ్ విద్యా సదస్సు



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న యూటీఎఫ్ నాయకులు

చీమకుర్తి: యూటీఎఫ్ మండల విద్యా సదస్సును జయప్రదం చేయాలని ఆ సంఘం జిల్లా కార్యదర్శి నల్లూరి వెంకటేశ్వరరావు పిలుపునిచ్చారు. గురువారం యూటీఎఫ్ ఉపాధ్యాయులతో కలిసి సదస్సుకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈనెల 12న చీమకుర్తిలోని భావనారుషి ఆలయం ప్రాంగణంలో కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విద్యారంగంలో వస్తున్న మార్పులు, భవిష్యత్ కార్యాచరణపై సదస్సులో చర్చించనున్నట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో అధ్యక్ష, కార్యదర్శులు షేక్ అక్బర్, చలువాది శ్రీనివాసరావు, స్థానిక టీచర్‌లు పాల్గొన్నారు.

జాతీయ క్షయ నిర్మూలన ర్యాలీ

నాగులుప్పలపాడు: మండల కేంద్రం నాగులుప్పలపాడులో గురువారం ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈర్యాలీలో స్థానిక శాసనసభ్యుడు బీఎన్ విజయకుమార్ పాల్గొని క్షయవ్యాధి రహిత భారత్‌కు ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. గ్రామంలో టీబీ ముక్త్ భారత్ అభియాన్, ప్రజలందరూ టీబీ వ్యాధి పట్ల శ్రద్ధ వహించడంలో భాగస్వాములు కావాలని వైద్యబృందం సూచించారు. కార్యక్రమంలో ఆరోగ్యశాఖ టీబీ సూపర్ వైజర్ చంద్రమౌళి, వైద్యశాల సూపర్‌వైజర్ శౌరయ్య, ఏఎన్ఎం వినోలియా, ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

ఈవీఎంల గోదాములు తనిఖీ



తనిఖీ చేస్తున్న ఇన్‌చార్జి కలెక్టర్ గోపాలకృష్ణ

ఒంగోలు వన్‌టౌన్: నగరంలోని మామిడిపాలెంలో ఉన్న ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్ల (ఈవీఎంల) గోదాములను జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణ గురువారం తనిఖీ చేశారు. గోదాములకు వేసిన సీళ్లను పరిశీలించారు. భద్రతా ఏర్పాట్లపై సమీక్షించారు. ఆయన వెంట కలెక్టరేట్‌లోని ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ శ్రీనివాసరావు, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

ఈ-క్రాప్ నమోదు తప్పనిసరి



మాట్లాడుతున్న తహసీల్దార్ నారాయణరెడ్డి

సంతనూతలపాడు: ప్రతి రైతు సాగు చేసిన పంటను ఈ-క్రాప్‌లో నమోదు చేయాలని తహసీల్దార్ నారాయణరెడ్డి పేర్కొన్నారు. గురువారం తహసీల్దార్ కార్యాలయలంలో వీఆర్వోలు, వీఏఏలకు డిజిటల్ క్రాప్ సర్వే 2025 సమావేశం నిర్వహించారు. సమావేశానికి ఏవో పీ పావని అధ్యక్షత వహించారు. ఈసందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం డిజిటల్ క్రాప్ సర్వే 2025 ప్రకారం సర్వే చేసిన ప్రతి భూ కమతాలను జియో ఫెన్సింగ్‌లో పొలంలో సర్వే చేసి ఫోటో తప్పనిసరిగా తీయాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ గణాంక అధికారి శ్రీనివాసరావు, ఏఈవోలు ఎస్. వెంకట్రావు, కేవీ సుబ్బారెడ్డి, వీఏఏలు, ఆర్వోలు పాల్గొన్నారు.

వైభవంగా గురుపౌర్ణమి వేడుకలు

- కిటకిటలాడిన ఆలయాలు
- సాయిబాబా ఆలయాల్లో ప్రత్యేక పూజలు
- అన్నసంతర్పణ చేసిన నిర్వాహకులు

సంతనూతలపాడు: హైందవ ధర్మంలో గురువుకు విశిష్ట స్థానం ఉంది. బ్రహ్మ రాసిన రాతను సైతం తన బొటనవేలితో తుడిచివేసే శక్తి సంపన్నుడిగా గురువును అందరూ ఆరాధిస్తారు. ఆది గురువుగా భాసిల్లే వ్యాసుడు జన్మించిన తిథిగా ఆషాఢ శుద్ధ పౌర్ణమిని గురుపౌర్ణిమగా జరుపుకుంటారు. అయితే ఇటీవల అంతటి గురుతత్వాన్ని ప్రబోధించిన దత్తాత్రేయుడికి ప్రతిరూపంగా భావించి పూజించే షిరిడీ సాయినాథుడు గురు పౌర్ణమి నాడు విశేష పూజలందుకున్నాడు. ఈసారి సద్గురువులకు ప్రీతికరమైన గురువారం రానుండడంతో వేడుకలు మరింత ఘనంగా జరగాయి. సంతనూతలపాడు మండలం పేర్నమిట్టలో షిరిడీ సుందర సాయి మందిరంలో ఆలయ ప్రధాన అర్చకులు పేర్నమిట్ట హరిప్రసాదరావు బృందం ఆధ్వర్యంలో ఘనంగా గురు పౌర్ణమి వేడుకలు జరిగాయి.

ఈసందర్భంగా అర్చకులు స్వర్ణ వీరరాఘవయ్య, ఐ జానకి రామయ్య ఆధ్వర్యంలో సాయిబాబా వారికి విశేష అలంకరణ, అభిషేకాలు, సిద్ధ మంగళ స్తోత్ర పారాయణ తదితర ప్రత్యేక పూజలను నిర్వహించారు. మండలంలోని సాయిబాబా ఆలయాలు, పుర వీధులు షిరిడీ సాయినాథుడి నామస్మరణతో మార్మోగాయి. సంతనూతలపాడు మండలంలోని మైనంపాడు, చిలకపాడు, సంతనూతలపాడు, పేర్నమిట్ట, రుద్రవరం తదితర గ్రామాల్లో గురు పౌర్ణమి నిర్వహించారు. ఉదయం నుంచి రాత్రి వరకు అలంకార సేవలు, నగరోత్సవాలు, మహా అన్నసంతర్పణ కార్యక్రమాలు నిర్వహించారు.



లాయరుపేటలో అలంకరణలో సాయిబాబా..



లాయరుపేట సాయిబాబా ఆలయంలో మహిళా భక్తులు



సంతపేటలో సాయిబాబాను దర్శించుకుంటున్న భక్తులు

మద్దిపాడు మండలంలో..

మద్దిపాడు: మండలంలో పలు గ్రామాల్లో ఉన్న సాయిబాబా ఆలయాల్లో గురుపౌర్ణమి సందర్భంగా అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మాజీ మంత్రి, నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి మేరుగు నాగార్జున ఇనమనమెళ్లూరు గ్రామంలోని సాయిబాబా ఆలయంలో స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆయన వెంట మండల పార్టీ ఉపాధ్యక్షుడు వాకా కోటిరెడ్డి, బొమ్మల రామాంజనేయులు, కంకణాల సురేష్, అనిల్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయాల్లో సాయినాథుని పల్లకీ సేవ..

ఒంగోలు మెట్రో: నగరంలోని సాయిబాబా ఆలయాల్లో గురుపౌర్ణమి వేడుకలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఒంగోలు లాయర్‌పేట షిర్డీ సాయిబాబా మందిరం, సంతపేట షిర్డీ సాయిబాబా మందిరం, మంగమూరు డొంక గాంధీనగర్ భగవాన్ సత్యసాయిబాబా మందిరం, కర్నూలు రోడ్ లోని సాయిబాబా మందిరం, మంగమూరు డొంక అచలానంద ఆశ్రమం, మంగమూరు మర్రిచెట్ల కాలనీ ఆశ్రమంలో బాబా మందిరం, సంతపేట గొలగమూడి వెంకయ్యస్వామి మందిరం, త్రోవగుంట సాయిబాబా మందిరం, పెళ్లూరు సాయిబాబా మందిరం, కొప్పోలు షిర్డి సాయిబాబా మందిరాల్లో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. సాయినాథుని మూలవిరాట్‌కు అర్చకులు పంచామృతాల అభిషేకం, నిర్వహించి వివిధ రకాల పూలతో అలంకరించి విశేష అర్చన నిర్వహించారు. భక్తులు సామూహికంగా గురుచరిత్ర పారాయణం, సాయి గానామృతం భజనలు నిర్వహించారు. మధ్యాహ్నం సాయినాథుని మందిరాల్లో స్వచ్ఛంద సంస్థల చేత నిర్వహించిన అన్న ప్రసాదంలో అధిక సంఖ్యలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

గురుపౌర్ణమి సందర్భంగా గిరి ప్రదక్షిణ..

గురు పౌర్ణమి సందర్భంగా ఒంగోలు కొండ మీద స్కందగిరి, శ్రీగిరి గిరి ప్రదక్షిణ సేవా కమిటీ వారి ఆధ్వర్యంలో రాత్రి అలివేలు మంగ, పద్మావతి దేవేరుల సమేత వెంకటేశ్వరస్వామిని దివ్య రథంపై పుష్పాలతో చక్కగా అలంకరించి గిరిప్రదక్షిణ చేశారు. గోశాలలో గోపూజ నిర్వహించి స్వామివార్లకు అష్టోత్తర పూజ పూజాక్రతువులను నిర్వహించి భక్తిశ్రద్ధలతో కోర్టు సెంటర్, పెద్ద శివాలయం సెంటర్, శర్మ కాలేజ్ సెంటర్, గద్దలగుంట పురవీధుల గుండా కొండమీద స్కందగిరి చేరుకొని స్వామివార్లను దర్శించుకున్నారు. శ్రీగిరి గిరి ప్రదక్షిణ సేవా కమిటీ నిర్వాహకులు బొమ్మిరెడ్డి రాఘవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చీమకుర్తి: గురుపౌర్ణమి సందర్భంగా చీమకుర్తి రచ్చమిట్టలోని సాయిబాబా మందిరంలో ఏఎంసీ మాజీ చైర్మన్ మారం వెంకారెడ్డి తన సతీమణి, కుమార్తెతో హాజరై పూజలు చేశారు. మందిరంలోని పూజారి వారిని ఆశీర్వదించారు. కార్యక్రమంలో స్థానిక భక్తులు పాల్గొన్నారు.



లాయరుపేట సాయిబాబా ఆలయంలో అన్నసంతర్పణలో భక్తులు



సంతపేటలో సాయిబాబా ఆలయంలో పూజలు చేస్తున్న మహిళా భక్తులు



పేర్నమిట్టలోని శిరిడిసాయి ఆలయంలో పూజల్లో పాల్గొన్న భక్తులు



సాయిబాబా మందిరంలో పూజలు చేస్తున్న ఏఎంసీ మాజీ చైర్మన్ వెంకారెడ్డి, కుటుంబ సభ్యులు



అచలానంద ఆశ్రమంలో మాట్లాడుతున్న పరిపూర్ణానందస్వామి



ఇనమనమెళ్లూరులో పూజలు నిర్వహిస్తున్న నియోజకవర్గ ఇన్‌చార్జి నాగార్జున



లాయరుపేట సాయిబాబా ఆలయంలో బాబాను దర్శించుకోవడానికి క్యూలో ఉన్న భక్తులు

మెగా పీటీఎంకు స్పందన అంతంత మాత్రమే

- ఆసక్తి చూపని తల్లిదండ్రులు
- సరైన ఏర్పాట్లు చేయని అధికారులు

చీమకుర్తి: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకొని నిర్వహించిన మెగా పేరెంట్స్ టీచర్స్ మీటింగ్‌కు పేరెంట్స్ నుంచి స్పందన ఆశించినంత లభించలేదు. గురువారం చీమకుర్తి మండలంలో ఉన్న పలు ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యలో 40 శాతానికి మించి తల్లిదండ్రుల నుంచి స్పందన రాకపోవడం గమనార్హం. వచ్చిన పేరెంట్స్‌తో ఉపాధ్యాయులు మెగా పేరెంట్స్ నిబంధనల ప్రకారం కార్యక్రమాలను నిర్వహించి చేతులు దులుపుకున్నారు. నిబంధనల్లో భాగంగా పాఠశాలల్లో ఏర్పాటు చేసిన ఫొటో బూత్‌లో విద్యార్థులు ఉత్సాహంగా ఫొటోలు మాత్రం దిగారు. విద్యార్థుల ప్రోగ్రెస్‌కు సంబంధిచిన హోలిస్టిక్ కార్డులను అందించారు. వచ్చిన పేరెంట్స్‌కు మాత్రం విద్యార్థులను క్రమం తప్పకుండా పాఠశాలలకు పంపించాలని విజ్ఞప్తి చేశారు. చీమకుర్తి ప్రభుత్వ హైస్కూలులో నిర్వహించిన కార్యక్రమంలో ప్రధాన వక్తలు లయన్స్ క్లబ్ వ్యవస్థాపకులు డాక్టర్ బీ.జవహర్, చలువాది బదరీనారాయణతో పాటు ఎంఈఓలు నర శింహరావు, శివాజీ, హెచ్‌ఎంతో పాటు ఉపాధ్యాయులు, పేరెంట్స్‌కు ఎన్‌సీసీ విద్యార్థులు ఘనంగా స్వాగతం పలికారు.

పేరుకే మెగా పేరెంట్స్ సమావేశం

మద్దిపాడు: మండల కేంద్రం మద్దిపాడులోని కడియాల యానాదయ్య ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జరిగిన మెగా పేరెంట్స్ డేకి తల్లిదండ్రులు గైర్హాజయ్యారు. పాఠశాలలో సుమారుగా 500కు పైగా విద్యార్థులు ఉండగా కేవలం పదుల సంఖ్యలోనే తల్లిదండ్రులు హాజరు కావడం గమనార్హం. పేరెంట్స్ డే కోసం ఉపాధ్యాయులు గత నాలుగు రోజుల నుంచి విద్యార్థుల తల్లిదండ్రులకు ఫోన్ చేసి తప్పకుండా మీటింగ్ కు రావాలని పిలిచినా స్పందన శూన్యం. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా స్పెషల్ ఆఫీసర్ నారాయణరావు హాజరై విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడారు. కార్యక్రమంలో ఎంపీడీఓ వీ జ్యోతి హెచ్‌ఎం, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

సంతనూతలపాడు: స్థానిక మండల కేంద్రం గురుకుల పాఠశాలలో జరిగిన మెగా పీటీఎంకు జెడ్పీటీసీ దుంపా రమణమ్మ, ఎంపీపీ విజయ, సర్పంచ్ దర్శి నాగమణి ముఖ్య అతిథులుగా పాల్గొని విద్యార్థులకు పలు సూచనలు చేశారు. నియోజకవర్గ ఎన్నికల స్పెషల్ ఆఫీసర్ వరకుమార్ విద్యార్థులకు సూచనలు చేశారు. ఎస్సై వేజెండ్ల అజయ్‌బాబు విద్యార్థులకు గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై అవగాహన కల్పించారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని సంతనూతలపాడు మండల స్పెషల్ ఆఫీసర్, జిల్లా పరిషత్ సీఈవో చిరంజీవి కోరారు. మండలం మైనంపాడు హైస్కూల్లో హాజరై అనంతరం ప్రసంగించారు. తహసీల్దార్ నారాయణరెడ్డి, ఎంపీడీవో సురేష్‌బాబు, ఎంఈఓ డీ వెంకారెడ్డి ఎంపీపీ బుడంగుంట విజయ, చిలకపాడు సర్పంచ్ బొలినేని కోమలి, మధుసూదన్‌రావు, ఎస్ఎంసీ చైర్మన్ కే.సుమలత, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

విద్యపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి..

ఒంగోలు సిటీ: తల్లిదండ్రులు తమ పిల్లల విద్య పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఏకేవీకే కళాశాల జాయింట్ సెక్రటరీ డాక్టర్ అమృతవల్లిదేవి అన్నారు. జూనియర్ కళాశాలలో మెగా పేరెంట్స్ మీటింగ్ నిర్వహించారు. సమావేశంలో ఆంధ్ర కేసరి కళాశాల అధ్యక్షులు మండువ నాగేశ్వరరావు, కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ పల్లపు చెంచురామయ్య, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ కారుమూడి రామిరెడ్డి, జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ కందుల వెంకట రెడ్డి పాల్గొన్నారు.

➤ విద్యార్థులు చిన్నతనం నుంచే కష్టపడే తత్వంను అలవరచుకోవాలని టూటౌన్ సీఐ శ్రీనివాసరావు అన్నారు. ఒంగోలు సంతపేటలోని డీఆర్‌ఆర్‌ఎం మున్సిపల్ స్కూల్ నందు తల్లిదండ్రుల, ఉపాధ్యాయుల ఆత్మీయ సమావేశం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో వెంకట్రావు, బండారు మదన్, రాంబాబు, పూర్వ విద్యార్థి శివప్రసాద్, చావలి వెంకటరమణ, ఆరిగ ప్రతాప్, నారాయణ పాల్గొన్నారు.



చీమకుర్తి ప్రభుత్వ హైస్కూలులో పాల్గొన్న వక్తలు, ఎన్‌సీసీ విద్యార్థినులు



ఎస్‌ఎన్‌పాడులో పీటీఎంలో పాల్గొన్న జెడ్పీటీసీ రమణమ్మ

అలవిగాని హామీలతో మోసం చేసిన చంద్రబాబు



మాట్లాడుతున్న నియోజకవర్గ ఇన్‌చార్జ్ రవిబాబు, పక్కన నాయకులు

- నియోజకవర్గ ఇన్‌చార్జ్ చుండూరి రవిబాబు ధ్వజం

ఒంగోలు సిటీ: అలవిగాని హామీలతో ప్రజలను మోసం చేసి గద్దెనెక్కిన మోసగాళ్లు చంద్రబాబు, కూటమి నాయకులని ఒంగోలు వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ చుండూరి రవిబాబు ధ్వజమెత్తారు. గురువారం ఒంగోలు నగరంలో 30వ డివిజన్‌లో జరిగిన కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రవిబాబు మాట్లాడుతూ.. సూపర్‌సిక్స్ పథకాల పేరుతో ప్రజలను వెన్నుపోటు పొడిచిన ఘనత చంద్రబాబుకే దక్కుతుందన్నారు. గతంలో ఇంటి వద్దకే సంక్షేమ పథకాలు అందించిన ఘనత మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది గడిచిందని, ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను పూర్తిగా విస్మరించిందని విమర్శించారు. పాలకులు సంక్షేమం, అభివృద్ధిని మరిచిపోయారన్నారు. ఈ డివిజన్‌లోని వైఎస్సార్ విగ్రహానికి చుండూరి రవిబాబు పూలమాలలు సమర్పించి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఒంగోలు నగర అధ్యక్షుడు కఠారి శంకరరావు, బీసీ సెల్ జిల్లా అధ్యక్షులు బొట్ల సుబ్బారావు, లీగల్ సెల్ జిల్లా అధ్యక్షుడు నగరికంటి శ్రీనివాసరావు, నూతన డివిజన్ అధ్యక్షుడు మేడిద ప్రేమ్‌చంద్, కార్పొరేటర్ ప్రవీణ్‌కుమార్, నాయకులు చిన్నా, అప్సరబేగం, ప్రసన్న, మేరీ, వాణి, బుజ్జి, సన్నీ, స్వరూప్, విజయ్ కుమార్, వేముల శ్రీకాంత్, మల్లిశెట్టి దేవా, పీటర్, మురళి, రామారావు, యనమదల వరమ్మ, అన్నపూర్ణ, నరేష్, తాడిపత్రి వినయ్, కొప్పోలు వెంకటేష్, విజయ్, అఖిల్, సందీప్, బుజ్జిబాబు, నాయకులు, కార్యకర్తలు, హాజరయ్యారు.

బీఎల్వోలు, సూపర్‌వైజర్లకు ప్రత్యేక శిక్షణ

సంతనూతలపాడు: మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఎన్నికల ప్రక్రియపై మండల స్థాయిలో సూపర్‌వైజర్ల, బీఎల్వోలకు ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. నియోజకవర్గ ఎన్నికల అధికారి, ఎస్. వరకుమార్, సంతనూతలపాడు తహసీల్దార్ ఎస్ఎల్ నారాయణ రెడ్డి ఎన్నికల ప్రక్రియపై పలు సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో ఎలక్షన్ డీటీ అరుణ, రిసోర్స్ పర్సన్ చందు, ఎలక్షన్ ఆపరేటర్లు పణి, అనిల్, రమేష్, అనిల్ కుమార్‌లు పాల్గొన్నారు.

అమ్మవారికి నేడు సారె సమర్పణ

చీమకుర్తి: చీమకుర్తి హరిహరక్షేత్రంలోని శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారికి శుక్రవారం సారె మహోత్సవ కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ ధర్మకర్తలు శిద్దా లక్ష్మీపద్మావతి, సుధావళి, వారి కుటుంబ సభ్యులు గురువారం తెలిపారు. ఆషాఢ మాసం పురస్కరించుకొని అమ్మవారికి శాకంబరి అలంకరణ, గోరింటాకు పండుగ, లక్ష మల్లెలార్చన వంటి పలు ఆధ్యాత్మిక కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పట్టణంలోని మహిళా భక్తులు కార్యక్రమంలో పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు.



వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారు

ఆంజనేయుడికి బంగారపు మీసం వితరణ

ఒంగోలు మెట్రో: కేశవక్షేత్రం కొప్పోలు చెన్నకేశవ ఆంజనేయ స్వామి దేవస్థానంలో గురువారం గురుపౌర్ణమి సందర్భంగా హైదరాబాద్‌కు చెందిన కాట్రగడ్డ శ్రీమన్నారాయణ, ప్రమీల దంపతులు స్వామి వారికి 8 గ్రాముల సువర్ణ బంగారపు మీసంను సమర్పించారు. ముందుగా ఆలయ ప్రధాన అర్చకులు పరాంకుశం సమీర్‌కుమార్ శాస్త్రోక్తంగా సంప్రోక్షణ చేసి మూలవిరాట్‌కు అభిషేకం నిర్వహించారు. అనంతరం అర్చకులు దాతలు చేతుల మీదుగా స్వామివారి బంగారపు మీసమును అందుకున్నారు. కార్యక్రమంలో భక్తులు, ఆలయ కార్యనిర్వాహణాధికారి కట్ట సునీల్‌కుమార్ పాల్గొన్నారు.



బంగారపు మీసమును సమర్పిస్తున్న దాతలు

మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి



మాట్లాడుతున్న జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ అయేషాబేగం

ఒంగోలు సిటీ: యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ అయేషాబేగం అన్నారు. గురువారం పేర్నమిట్టలోని శ్రీప్రతిభ, శ్రీగురుదత్త పాఠశాల ప్రాంగణంలో ఉపాధ్యాయ తల్లిదండ్రుల ఆత్మీయ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా అయేషా బేగం మాట్లాడుతూ మాదక ద్రవ్యాల వాడకంతో శారీరకంగా, మానసికంగా తీవ్ర ప్రభావాలు చూపుతాయని, వీటి వాడకం చట్టబద్ధంగా నేరమని తెలిపారు. విద్యార్థులు చిన్నతనం నుంచే కష్టపడే తత్వాన్ని అలవరచుకోవాలని కోరారు. అనంతరం విద్యార్థులకు ప్రశంస పత్రాలను అందజేశారు. శ్రీప్రతిభ కళాశాల చైర్మన్ నల్లూరి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఒక్క విద్య ద్వారానే మనిషి విజ్ఞానంతో పాటు సమాజ గౌరవాన్ని ధనాన్ని పొంది తన కుటుంబ పరిస్థితులను ఎంతో ఉన్నతంగా మార్చుకోవచ్చని తెలిపారు. కార్యక్రమంలో విద్యా సంస్థల వైస్ చైర్మన్ నల్లూరి సీతారామాంజనేయులు, సీఈఓ జయప్రకాష్ నారాయణ్, ప్రిన్సిపాల్ శ్రీదేవి, శానిటరీ ఇన్స్‌స్పెక్టరు దాసరి వెంకటేశ్వర్లు, రమాదేవి, భూషణం, ఎక్సైజ్ ఇన్స్‌స్పెక్టర్ లీనా, ఎస్సై అశోక్‌కుమార్, గీత, రవి, ఆంజనేయులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

బధిర విద్యార్థులకు స్వీట్లు, పండ్లు పంపిణీ

ఒంగోలు వన్‌టౌన్: ఒంగోలులోని ప్రభుత్వ బధిరుల పాఠశాల విద్యార్థులకు దోస్తీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో గురువారం స్వీట్లు, పండ్లను ఫౌండేషన్ వ్యవస్థాపకుడు ఎస్‌కె మహబూబ్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిస్సహాయులైన పేద విద్యార్థులకు అన్ని విధాలుగా అండగా ఉంటామన్నారు. కార్యక్రమంలో మానవతా సేవా సంస్థ అధ్యక్షుడు మారెళ్ల సుబ్బారావు, నత్తల శ్రీనివాసరావు, ప్రిన్సిపాల్ ఎస్‌కె మస్తాన్ వలి తదితరులు పాల్గొన్నారు.